

సివిల్ సప్లయిస్ గోదాములో తనిఖీలు

సీతంపేట: జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకుల తూనికల్లో తేడాలు ఉన్నాయని, వీటిపై పూర్తిస్థాయి నివేదిక అందించాలని పౌరసరఫరాల శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం సీతంపేట సివిల్ సప్లయిస్ గోదామును బొబ్బిలి సర్కిల్ తూనికల కొలతల శాఖ సీఐ బలరాంకృష్ణ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. కందిపప్పు, ఆయిల్, పంచదార ప్యాకెట్లకు తూనికలు వేసి పరిశీలించారు. తూనికల్లో వ్యత్యాసాలకు సంబంధించి నివేదికను ఉన్నతాధికారులకు అందిస్తామని వారు చెప్పారు. ఈ పరిశీలనలో సివిల్ సప్లయిస్ డీటీ రమేష్‌బాబు తదితరులు ఉన్నారు.

- అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన జిల్లా ఎమ్మెల్యేలు
- ఆనందంలో కూటమి శ్రేణులు

శాసన సభలోకి తొలి అడుగు



పార్వతీపురం, జూన్ 21(ఆంధ్రజ్యోతి):

శాసనసభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సభ కొలువు తీరింది. జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారు తొలిసారిగా అసెంబ్లీలో అడుగుపెట్టారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. సాలూరు నియోజకవర్గం నుంచి టీడీపీ కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచి మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన గుమ్మిడి సంధ్యారాణి తొలుత ప్రమాణస్వీకారం చేశారు. ఇంతకముందు ఆమె మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత కురుపాం, పార్వతీపురం టీడీపీ ఎమ్మెల్యేలు తోయక జగదీశ్వరి, బోనెల విజయచంద్ర, పాలకొండ జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణతో ప్రొటెం స్పీకర్ బుచ్చయ్యచౌదరి ప్రమాణ స్వీకారం చేయించారు. వారు కూడా తొలిసారి ఎమ్మెల్యేలుగా గెలిచి.. శాసనసభలో అడుగు పెట్టారు. నాలుగు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించి అసెంబ్లీకి వెళ్లడంతో జిల్లాలో నాయకులు, కార్యకర్త లు, అభిమానులు, ప్రజలు సంబరాలు చేసుకున్నారు. టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోయి ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాన్ని ఆద్యంతం ఆసక్తిగా తిలకించారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శపథం నేర వేరిందని ఆనందం వ్యక్తం చేశారు. జనసేన అధినేత , డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తొలిసారి అసెంబ్లీలో అడుగుపెట్టి ప్రమాణ స్వీకారం చేయడంతో జనసేన శ్రేణులతో పాటు ఆయన అభిమానులు, ప్రజలు ఉప్పొంగిపోయారు. ఇదే స్ఫూర్తితో టీడీపీ, జనసేన, బీజేపీ కలిసికట్టుగా ముందుకు సాగాలని, మరెన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కాంక్షించారు. ఎన్డీఏ ప్రభుత్వ పాలనలో రాష్ట్రానికి ఎంతో మేలు జరుగుతుందని బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆశాభావం వ్యక్తం చేశారు.





రుణపడి ఉంటా..

అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసి నప్పుడు ఎంతో ఆనందపడ్డా. ఒక గిరిజన మహిళకు ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, మంత్రి నారా లోకేష్, నన్ను గెలపించిన నియోజకవర్గ ప్రజలకు జీవితకాలం రుణపడి ఉంటా. ప్రతి ఒక్కరి సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శాయశక్తులా కృషి చేస్తా. గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తా.

-తోయక జగదీశ్వరి,
ఎమ్మెల్యే,
కురుపాం

ఆనందంగా ఉంది..

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఎమ్మెల్యేగా పనిచేసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా ఉంది. సీఎం చంద్రబాబునాయుడు, మంత్రులు లోకేష్, గుమ్మిడి సంధ్యారాణి సహకారంతో పార్వతీ పురం నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా. భారీ మెజార్టీతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపించిన పార్వతీపురం నియోజ కవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపు తున్నా. అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసినప్పుడు నా ఆనందానికి హద్దుల్లేవు. నాపై ఎంతో నమ్మకం ఉంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలు, ఇంతటి అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, మంత్రి నారా లోకేష్‌కు రుణపడి ఉంటాను.

-బోనెల విజయచంద్ర,
ఎమ్మెల్యే, పార్వతీపురం



అదృష్టంగా భావిస్తున్నా..

సాలూరు: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో మంత్రిగా పనిచేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా. శాసనసభలో సభ్యురాలుగా ప్రమాణ స్వీకారం చేయడం చాలా ఆనందంగా ఉంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీని కౌరవసభగా మార్చేశారు. దీనిని గమనించిన ప్రజలు ఆ పార్టీకి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారు. ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పారు. యువ నాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పార్టీ విజయానికి ఎంతో దోహదపడింది. అదే సమయంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించాం. నాపై ఎంతో నమ్మకంతో రెండు కీలక శాఖలు అప్పగించిన చంద్రబాబుకు కృతజ్ఞతలు. ప్రతి ఒక్కరి సహకారంతో మంత్రిగా రాష్ట్ర, జిల్లాతో పాటు సాలూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా. భారీ మెజార్టీతో నన్ను ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించిన నియోజకవర్గ ప్రజలకు ఎంతో రుణపడి ఉంటా..

-గుమ్మిడి సంధ్యారాణి, మంత్రి, సాలూరు



జీవితంలో మరువలేనిది..

పాలకొండ: అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడం జీవితంలో మరువలేనిది. 20 సంవత్సరాల తర్వాత నా తండ్రి మాజీ ఎమ్మెల్యే నిమ్మక గోపాలరావు వారసుడిగా అసెంబ్లీకి పంపించిన నియోజకవర్గ ప్రజలకు ఎంతో రుణపడి ఉంటా. అందరి సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తా. ఎమ్మెల్యేగా పాలకొండ నియోజక వర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తా. మా కుటుంబానికి నియోజకవర్గ ప్రజలు రాజకీయంగా పునర్జన్మ ఇచ్చారు.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ


సీతంపేటలో..


సాలూరులో..

యోగాతో ఒత్తిడి దూరం

- ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

పార్వతీపురం, జూన్ 21(ఆంధ్రజ్యోతి)/ సీతంపేట/ సాలూరు: యోగా సాధనతో ఒత్తిడి దూరం చేసుకోవచ్చని, మానసిక, శారీరక ఆరోగ్యం పొందొచ్చని పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ తెలిపారు. ఆయుష్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఏపీ ఎన్జీవో భవనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. సూర్య, పతంజలి యోగా కేంద్రం, బ్రహ్మకుమారీ సంస్థ ప్రతినిధులు యోగాసనాలు, ధ్యానం ప్రయోజనాలను వివరించారు. విద్యార్థులతో సూర్య నమస్కారాల సాధన చేయించారు. అనంతరం పీవో మాట్లాడుతూ ప్రస్తుతం ప్రతి రంగంలో తీవ్ర పోటీ నెలకొందని, దీంతో అందరూ మానసిక ఒత్తిడి లోనవుతున్నారన్నారు. మానసిక ప్రశాం తత, శారీరక ఆరోగ్యానికి యోగా ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. దిశా డీఎస్పీ హర్షిత మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం 20 నిమిషాల పాటు యోగా, శారీరక వ్యాయామం చేస్తే.. రోగాలకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఆయుష్ నోడల్ అధికారి బి.సుశీల, ఇన్‌చార్జి డీఆర్వో కేశవనాయుడు, డీపీవో సత్యనారాయణ, డీపీఆర్వో లోచర్ల రమేష్ తదితరులున్నారు. ఇక సీతంపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో, సాలూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగా డే అక్షరాకృతిలో కూర్చొని అందర్నీ ఆకట్టుకున్నారు. అనంతరం వారు యోగాసనాలు వేశారు.


పార్వతీపురంలో యోగా చేస్తున్న ఐటీడీఏ పీవో


సుంకి పంట పొలాల్లో సంచరిస్తున్న ఏనుగులు

సుంకిలో గజరాజులు

గరుగుబిల్లి, జూన్ 21 : గరుగుబిల్లి మండలం సుంకి గ్రామంలో ఏనుగులు హల్‌చల్ చేస్తున్నాయి. గురువారం రాత్రి మరుపెంట ప్రాంతంలో సంచరించిన ఏనుగుల గుంపు శుక్రవారం సుంకి సమీపంలోకి చేరుకున్నాయి. ఈ గ్రామంలో వరి, పామాయిల్, తదితర పంటలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. మరోవైపు ఖరీఫ్ వరి నారుమళ్లు వేసేందుకు మరికొందరు వెనుకంజ వేస్తున్నారు. ముమ్మరంగా పొలం పనులు జరగాల్సిన సమయంలో ఏనుగులు సంచరించడంతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ఇదిలా ఉండగా ఏనుగులు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నారు. సంబంధిత అటవీ అధికారులు స్పందించి ఏనుగులు గుంపును తరలించే చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

- వాటిపై దృష్టి సారించిన టీడీపీ కూటమి ప్రభుత్వం
- త్వరలోనే పాలకవర్గ సమావేశాలు
- మెరుగైన సేవలందించేందుకు చర్యలు
- ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కసరత్తు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

ఐటీడీఏలకు పూర్వ వైభవం


సీతంపేట ఐటీడీఏ

పార్వతీపురం, జూన్ 21(ఆంధ్రజ్యోతి):

గిరిజనుల సంక్షేమం కోసం ఏర్పాటైన ఐటీడీఏలకు త్వరలోనే పూర్వవైభవం వచ్చే పరిస్థితి కనిపిస్తుంది. వాటిపై టీడీపీ కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. నిధుల కేటాయింపు, పాలకవర్గ సమావేశాలు తదితర అంశాలపై సమీక్షిస్తోంది. ఐటీడీఏలను పటిష్ఠపర్చి గిరిజనులకు మెరుగైన సేవలను అందించాలని భావి స్తోంది. ఈ మేరకు సంబంధిత అధికారులకు కూడా ఆదేశాలు జారీ చేసింది. దీంతో జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన శాఖ మంత్రి కూడా మన్యం జిల్లాకు చెందిన వారే కావడంతో గిరిజనులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

వైసీపీ పాలనలో..

గత వైసీపీ సర్కారు పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏలను నిర్వీర్యం చేసింది. వాటికి నిధుల మంజూరు చేయకుండా నామమాత్రంగా మార్చింది. ఐటీడీఏలకు మంజూరయ్యే నిధులను ఇతర అవసరాలకు మళ్లించింది. దీంతో గ్రీవెన్స్‌లో పలు సమస్యలపై గిరిజనులు ఇచ్చే అర్జీలను సైతం పరిష్కరించలేని దయనీయ స్థితికి ఐటీడీఏలు చేరాయి. కనీస అవసరాలకు కూడా నిధులు లేని పరిస్థితి ఏర్పడింది. ఐటీడీఏలు ఏర్పడిన తర్వాత ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ లేదని చెప్పవచ్చు. నిధులు లేకపోవడంతోతో అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో..

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐటీడీఏల ద్వారా గిరిజనులకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించేవారు. ట్రైకార్ రుణాలతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన నిరుద్యోగ గిరిజనులకు సబ్సిడీపై వాహనాలు, వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసేవారు. గిరిజనుల ఆర్థికాభివృద్ధికి ఐటీడీఏల ద్వారా పూర్తి సహాయ సహకారాలు అందించేవారు. యూత్ ట్రైనింగ్ శిక్షణను అందించి అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పించేవారు. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. ఐటీడీఏలను పూర్తిగా విస్మరించింది.

ఇదీ పరిస్థితి..

- నిబంధనల మేరకు ప్రతి మూడు నెలలకొకసారి ఐటీడీఏల పాలకవర్గ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. గిరిజనుల సమస్యలపై ప్రస్తావించి.. పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది. అభివృద్ధి కార్యక్రమాలపై తీర్మానాలు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపించాలి. అయితే గత వైసీపీ ఐదేళ్ల వైసీపీ సర్కారు పాలనలో ప్రజా ప్రతినిధులతో పాటు అధికారులు కూడా ఈ విషయాలను మరిచిపోయారు. పాలకవర్గ సమావేశాలను సక్రమంగా నిర్వహించలేకపోయారు. గత ఐదేళ్లలో చూసుకుంటే సీతంపేట ఐటీడీఏలో రెండు సార్లు, పార్వతీపురంలో రెండు సార్లు మాత్రమే తూతూమంత్రంగా పాలకవర్గ సమావేశాలు నిర్వహించారు.
- గత వైసీపీ సర్కారు ఐటీడీఏల నిర్వహణకు పూర్తిగా నిధులు కేటాయించడం మానేసింది. గిరిజనులకు ట్రైకార్, సీసీడీపీ, ఎన్ఎఫ్‌డీసీ పేరిట సబ్సిడీపై ఇవ్వాల్సిన రుణాలకు మంగళం పాడేసింది. రాయితీపై వ్యవసాయ పరికరాలు, వాహనాలు మంజూరు చేయలేదు. సబ్ ప్లాన్ మండలాల్లో రైతులకు విత్తనాలు, ఎరువులు అందించలేదు. రహదారుల నిర్మాణాన్ని పూర్తిగా మరిచారు. మొత్తంగా ఐటీడీఏల పరిధిలో వ్యవసాయం, ఉద్యానతో పాటు 24 శాఖలకు ఐదేళ్లుగా నిధులు కేటాయించడ లేదు. దీంతో వాటి పరిధిలో అభివృద్ధి పనులేవీ పెద్దగా జరగలేదు. గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలను కూడా చేపట్టలేదు. మొక్కల పెంపకంపైనా దృష్టి సారించలేదు. మరోవైపు ఆయా శాఖలకు అధికారులతో పాటు సిబ్బంది కూడా కార్యాలయాలకే పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.
- ఐటీడీఏల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన గర్భిణుల వసతి గృహాల్లో సిబ్బందికి కనీస వేతనాలు కూడా చెల్లించడం లేదు. జడ్పీ ద్వారా వారికి వేతనాలు అందిస్తామని చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం ప్రకటనలకే పరిమితమైంది. నెలల కొలదీ జీతాలు రాకపోవడంతో సిబ్బంది పస్తులతో కాలం వెళ్లదీస్తున్నారు.
- గతంలో పార్వతీపురం ఐటీడీఏలో డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ప్రత్యేక వాహనం ఉండేది. అయితే సుమారు నెలల కిందట వైసీపీ ప్రభుత్వం వాహన సదుపాయం లేకుండా చేసింది. సుమారు 20 పీహెచ్‌సీల పరిధిలో గ్రామాలను పర్యటించాల్సిన అధికారికి వాహన సదుపాయం లేదంటే ఐటీడీఏల్లో పరిస్థితి ఏ విధంగా అర్థం చేసుకోవచ్చు.

ప్రత్యేక గ్రీవెన్స్ లేక..

జిల్లా కేంద్రంగా మారిన తర్వాత పార్వతీపురం ఐటీడీఏలో ప్రతి సోమవారం ప్రత్యేంగా గ్రీవెన్స్ నిర్వహించడం లేదు. ఎందుకంటే కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు ఐటీడీఏ పీవో కూడా హాజరవుతుండడంతో ఐటీడీఏలో ఆ కార్యక్రమాన్ని చేపట్టడం లేదు. దీంతో గిరిజనులకు ఇబ్బందులు తప్పడం లేదు. తమ సమస్యలను నేరుగా పీవోకు చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. దీనిపై గిరిజన సంఘాల నేతలు గతంలో ఎన్నోసార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సీతంపేట ఐటీడీఏ మాదిరిగానే పార్వతీపురం ఐటీడీఏలోనూ ప్రత్యేకంగా గిరిజనుల కోసం గ్రీవెన్స్ నిర్వహించాలని డిమాండ్ చేసినా..గత వైసీపీ ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. నూతన ప్రభుత్వం స్పందించి ఐటీడీఏలకు పూర్వ వైభవం తెచ్చి..గిరిజనులను అన్ని విధాలుగా ఆదుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.


పార్వతీపురం ఐటీడీఏ

త్వరలో పాలకవర్గ సమావేశం

జిల్లాలోని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల్లో త్వరలోనే పాలకవర్గ సమావేశాన్ని నిర్వహిస్తాం. పూర్తిగా సమీక్షించి గిరిజనులకు ఉపయోగపడే విధంగా చర్యలు తీసుకుంటాం. ఏజెన్సీ ప్రాంతాల్లో సమస్యలను పరిష్కరిస్తాం. గిరిజనులను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో సక్రమంగా పాలకవర్గ సమావేశాలు కూడా నిర్వహించలేకపోవడం సిగ్గుచేటు.

- గుమ్మిడి సంధ్యారాణి,
మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

దిక్సూచి
DIKSUCHI

కోర్ బ్రాంచెస్‌లో బెస్ట్ సివిల్ ఇంజనీరింగ్

ఇంజనీరింగ్ అంటే కంప్యూటర్ సైన్స్ అన్నట్లుగా రోజులు మారాయి. నిజానికి కోర్ ఇంజనీరింగ్‌లో కంప్యూటర్ సైన్స్ లేదు. ఇంజనీరింగ్ మూలపుటమ్మలుగా ప్రసిద్ధి చెందిన మూడింటిలో సివిల్ ఒకటి కాగా మెకానికల్, ఎలక్ట్రికల్ తతిమా రెండూ. ఇప్పుడు ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచ్‌లన్నింటికీ మాతృకలు ఇవే. అయితే కంప్యూటర్ మోజులో ప్రపంచవ్యాప్తంగా చాన్నాళ్ళుగా సివిల్ ఇంజనీరింగ్‌కు ఆదరణ బాగా తగ్గింది. ఆ నేపథ్యంలో సదరు డిసిప్లిన్ అవసరాన్ని, అవకాశాలను రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు తార్కికంగా వివరించారు.



భౌతికంగా లేదంటే సహజంగా ఏర్పాటైన కట్టడాల డిజైన్, నిర్మాణం, నిర్వహణ కలగలిసిన వృత్తిపరమైన డిసిప్లిన్ సివిల్ ఇంజనీరింగ్. పబ్లిక్ వర్క్స్ అంటే రహదారులు, వంతెనలు, కాల్వలు, డ్యామ్‌లు, ఎయిర్‌పోర్టులు, మురుగునీటి వ్యవస్థలు, పైప్‌లైన్‌లు, భవనాలకు సంబంధించిన స్ట్రక్చరల్ కాంపోనెంట్స్, రైల్వేలు, వాటర్ సప్లయ్, ఇండస్ట్రియల్ ప్రాజెక్టులు, నివాస గృహాలు సహా భూమి, నీరు, పర్యావరణం, సివిలైజేషన్ అలాగే సంబంధిత ప్రాసెసస్‌కు సంబంధించిన వన్నీ సివిల్ ఇంజనీరింగ్‌లోకే వస్తాయి.

రిలేటెడ్ బ్రాంచ్‌లు

సివిల్(కన్‌స్ట్రక్షన్), సివిల్(పబ్లిక్ హెల్త్ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ రూరల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్(కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ), సివిల్ ఇంజనీరింగ్(ఎన్విరాన్‌మెంట్ అండ్ పొల్యూషన్ కంట్రోల్), సివిల్ ఇంజనీరింగ్(పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్), సివిల్ ఇంజనీరింగ్(రూరల్ ఇంజనీరింగ్), సివిల్ టెక్నాలజీకి తోడు ప్లానింగ్, ఆర్కిటెక్చర్‌కు అందులోని ఉప విభాగాలకూ ఇదే మాతృక.



కౌన్సెలింగ్ గైడెన్స్

అవకాశాలు

ప్రభుత్వ, ప్రైవేటు విభాగాల్లో సివిల్ ఇంజనీర్లకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వ అంటే మున్సిపల్ కార్పొరేషన్స్, వాటర్ బోర్డులు, ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ, న్యూఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్, మెట్రోరైల్, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, ఢిల్లీ స్టేట్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, సెంట్రల్ పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, మిలిటరీ ఇంజనీరింగ్ సర్వీసెస్, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎయిర్ ఫోర్స్, రైల్వేస్, ఇరిగేషన్ అండ్ ఫుడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, నేషనల్ హైడ్రో-ఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్, నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ లిమిటెడ్, డిఫెన్స్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, ఆర్ఐటీఈఎస్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డులు, వివిధ సంస్థలకు చెందిన బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ విభాగాలు సహా ఈ జాబితాకు అంతు లేదు. అలాగే అసిస్టెంట్, ఇంజనీర్, అసిసెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, చీఫ్ ఇంజనీర్ వంటి ఉద్యోగాలు ప్రభుత్వ సంస్థల్లో ఉంటాయి.

- అదే ప్రైవేట్ సెక్టర్‌లోకి వస్తే ట్రైనీ ఇంజనీర్‌తో మొదలై చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వరకు వేర్వేరు హోదాల్లో ఉద్యోగాలు ఉంటాయి. కన్‌స్ట్రక్షన్, డిజైన్ విభాగాల్లో సివిల్ ఇంజనీర్ సేవలు అవసరమవుతాయి. కాడ్(సీఏడీ) సాఫ్ట్‌వేర్‌పై పరిజ్ఞానానికి తోడు ఫైనైట్ ఎలిమెంట్ అనాలిసిస్ అలాగే అవసరమైన నైపుణ్యాలను అలవర్చుకుంటే ప్రైవేటు సంస్థల్లో ఎదుగుదలకు ఢోకా ఉండదు. ఆరంభంలో రెండున్నర నుంచి మూడున్నర లక్షల రూపాయల మేర వార్షిక ప్యాకేజ్ ఉంటుంది. ప్రైవేటు రంగంలో ముఖ్యంగా ఎల్ అండ్ టి మొదలుకుని టాటా ప్రాజెక్టు లిమిటెడ్, గ్యామన్ ఇండియా, గ్యామన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, ఒమెక్స్, సూపర్‌టెక్, షాపూర్‌జి అండ్ పల్లోంజి గ్రూప్, జీఎంఆర్ గ్రూప్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్, హిందుస్థాన్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ, ఆఫ్కాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అశోకా బిల్డ్‌కాన్, బిఎల్ కాష్యప్ అండ్ సన్స్ లిమిటెడ్, కన్సాలిడేటెడ్ కన్‌స్ట్రక్షన్ కన్సార్టియం లిమిటెడ్, ఎస్సార్ గ్రూప్, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, జేపీ గ్రూప్, నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ లిమిటెడ్, నేషనల్ బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్ కార్పొరేషన్, పుంజ్ లాయిడ్ తదితరాలు అతి పెద్ద కన్‌స్ట్రక్షన్ కంపెనీల్లో కొన్ని మాత్రమే.

అవసరం

సివిల్ ఇంజనీరింగ్ విషయంలో ప్రమోషన్ కార్యకలాపాలు చాలా అవసరం, కీలకం కూడా. కన్‌స్ట్రక్షన్ పరిశ్రమ, సంబంధిత సంస్థలు, వ్యవస్థలు అలాగే మీడియా ఇందుకు చేతులు కలపాల్సిన అవసరం ఉంది. రెగ్యులేటరీ వ్యవస్థలు, ప్రొఫెషనల్ సంస్థలతో కూడా కలిసి పనిచేయాలి. పే ప్యాకేజ్‌తో మొదలుపెట్టి కరికులమ్‌లో ఇండస్ట్రీ నిర్దేశిత థియరటికల్ కాన్సెప్ట్స్, నైపుణ్యాల పెంపుపై దృష్టి సారించాలి. అన్నింటికీ మించి అటు ఇండస్ట్రీ ఇటు విద్యా సంస్థలు చేతులు కలపాలి. వివిధ ఇంజనీరింగ్ విభాగాల మధ్య విద్యా సంస్థల్లో సీట్లు - భర్తీ విషయంలోనూ శాస్త్రీయ విధానాన్ని అమలు చేయాలి. ఒక జాబ్‌కు ఉన్న డిమాండ్, వేకెన్సీలను దృష్టిలో పెట్టుకుని ఇదంతా జరిగితే ఇంజనీరింగ్ విద్యావ్యవస్థలో మంచి రోజులు రావడమే కాదు, ఫలితాలూ బాగుంటాయి.

జేఎన్‌టీయూహెచ్‌లో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూహెచ్)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ ఇన్నోవేటివ్ లెర్నింగ్ అండ్ టీచింగ్(డీఐఎల్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి ఆర్నెల్లు. ప్రతి కోర్సులో మూడు థియరీ సబ్జెక్టులు ఉంటాయి. ఒక్కో సబ్జెక్ట్‌కు రెండు నెలల సమయం, 24 తరగతులు, మూడు క్రెడిట్‌లు నిర్దేశించారు. సాయంత్రం ఆరున్నర నుంచి ఎనిమిదిన్నర వరకు ఆన్‌లైన్ సెషన్స్ ఉంటాయి. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. అదనంగా ఒక నెల ప్రాజెక్ట్ వర్క్ చేయాల్సి ఉంటుంది. దీనికి ఆరు క్రెడిట్‌లు ఉంటాయి. కోర్సులో భాగంగా అసైన్‌మెంట్‌లు, ఎండ్ ఎగ్జామినేషన్ ఉంటాయి. అసైన్‌మెంట్‌లకు 40 శాతం, ఎండ్ ఎగ్జామినేషన్‌కు 60 శాతం వెయిటేజీ ఇస్తారు. ఫ్యాకల్టీ మెంబర్లు, ఉద్యోగస్తులు, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. యూనివర్సిటీకి చెందిన టీచింగ్&నాన్ టీచింగ్ సిబ్బంది, అకడమిక్ స్టూడెంట్స్‌కు కోర్సు ఫీజులో 40 శాతం రాయితీ లభిస్తుంది.

క్లౌడ్ అండ్ డెవోప్స్ కోర్సు: ఇందులో క్లౌడ్ టెక్నాలజీ ఏడబ్ల్యూఎస్ & మైక్రోసాఫ్ట్ అజ్యూర్, కంటిన్యూయస్ ఇంటిగ్రేషన్/కంటిన్యూయస్ డిప్లాయ్‌మెంట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవిజనింగ్ సబ్జెక్టులు ఉంటాయి.

డేటా సైన్స్ అండ్ జనరేటివ్ ఏఐఎల్‌ఎల్‌ఎమ్ కోర్సు: ఇందులో పైథాన్ ప్రోగ్రామింగ్, మెషిన్ లెర్నింగ్-డీప్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ అండ్ లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ సబ్జెక్టులు ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిప్లొమా/యూజీ/పీజీ పూర్తిచేసిన/చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. కంప్యూటర్స్‌కు సంబంధించి ప్రాథమిక పరిజ్ఞానం, ఏదేని ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్‌పై అవగాహన తప్పనిసరి.

- **కోర్సు ఫీజు:** రూ.25,000
- **అడ్మిషన్ ఫీజు:** రూ.1000
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.500
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 20
- **దరఖాస్తుల పరిశీలన:** జూలై 31
- **ఆన్‌లైన్ మోడ్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్:** ఆగస్టు 1 నుంచి 7 వరకు
- **అడ్మిషన్ ఫీజు, ట్యూషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** ఆగస్టు 14
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 17
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 20 నుంచి
- **ప్రోగ్రామ్‌ల ముగింపు:** 2025 ఫిబ్రవరి 19న
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

పీజేటీఎస్ఏయూలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)-ఎన్ఆర్ఐ/ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కోటా కింద బీఎస్సీ ఆనర్స్, బీటెక్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. విదేశాల్లో నివశిస్తున్న ఎన్ఆర్ఐ అభ్యర్థులు, ఎన్ఆర్ఐలు స్పాన్సర్ చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపీసీ, బైపీసీ స్ట్రీమ్‌లలో అడ్మిషన్స్ నిర్వహిస్తారు. అకడమిక్ మెరిట్(ఇంటర్/పన్నెండోతరగతి మార్కులు) ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు రూ.9,53,450లకు డీడీ, రూ.46,550ల నగదుతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. వీరికి ఫీ రీయింబర్స్‌మెంట్, ప్రభుత్వ రాయితీలు లభించవు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు.

- **బీటెక్ స్పెషలైజేషన్‌లు:** ఫుడ్ టెక్నాలజీ, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్
- **బీఎస్సీ ఆనర్స్ స్పెషలైజేషన్‌లు:** అగ్రికల్చర్, కమ్యూనిటీ సైన్స్

బైపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చర్‌లో బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ 10 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

ఎంపీసీ స్ట్రీమ్ కళాశాలలు-సీట్లు: సంగారెడ్డి-కందిలోని కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్‌లో బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) 3 సీట్లు; నిజామాబాద్-రుద్రూర్‌లోని కాలేజ్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) 1 సీటు; హైదరాబాద్-సైఫాబాద్‌లోని కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్‌లో బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ 2 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు: బైపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు(ఇండియన్/విదేశీ బోర్డు) నుంచి బయలాజికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

- ఎంపీసీ స్ట్రీమ్ కింద అప్లయ్ చేసుకోవాలంటే ఏదేని ఇండియన్/విదేశీ బోర్డు నుంచి మేథమెటిక్స్, ఫిజికల్ సైన్సెస్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి పూర్తిచేసి ఉండాలి.
- అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **ప్రాసెసింగ్ ఫీజు:** రూ.5,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 31
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in



నీలిట్‌లో డిప్లొమా, డిగ్రీ, పీజీ

అగర్తలాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఇంజనీరింగ్ డిప్లొమా, బీసీఏ, ఎమ్మెస్సీ(ఐటీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అకడమిక్ మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇంజనీరింగ్ డిప్లొమా: ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలీ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. ఒక్కోదానిలో 60 సీట్లు చొప్పున మొత్తం 120 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీసీఏ(బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్): ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి.

అర్హత: మేథ్స్, ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టులలో ఏవేని రెండు సబ్జెక్టులతో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు; మూడేళ్ల వ్యవధి గల ఏదేని ఇంజనీరింగ్ డిప్లొమా పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎమ్మెస్సీ(ఐటీ): ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మొత్తం 30 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ(ఐటీ/సీఎస్)/బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ(కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. మేథ్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తో పాటు బీఎస్సీ/బీకాం/బీఏ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

- **ఆన్‌లైన్/ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 28
- **ఎంపికైన అభ్యర్థుల మొదటి లిస్ట్ విడుదల:** జూలై 4న
- **వెబ్‌సైట్:** nielitagtadmission.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/w3c3dM3లో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



పీరియాడిక్ యాక్షన్ డ్రామా

'విరుపాక్ష', 'బ్రో' చిత్రాల తర్వాత సాయిదుర్గ తేజ్ నటిస్తున్న కొత్త చిత్రం షూటింగ్ ఇటీవల ప్రారంభమైంది. రోహిత్ కేపీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. చుట్టూ ల్యాండ్ మైన్లు, మధ్యలో ఎడారి భూమిలో ఓ పచ్చని చెట్టు.. ఉన్న ఈ పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఓ యూనివర్సల్ కాన్సెప్ట్‌తో ఈ సినిమా ఉంటుందని పోస్టర్ చూడగానే అర్థమవుతుంది. నిర్మాతలు మాట్లాడుతూ 'గ్రాండ్ స్కేల్‌లో భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరో సాయి పాత్ర చాలా శక్తిమంతంగా ఉంటుంది. ప్రత్యేకంగా రూపొందించిన భారీ సెట్‌లో ప్రస్తుతం షూటింగ్ జరుగుతోంది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేస్తాం' అని చెప్పారు.

మా ఊరు శ్రీకాకుళం..



'వెన్నెల' కిశోర్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం 'శ్రీకాకుళం షెర్లాక్ హోమ్స్'. రైటర్ మోహన్ దర్శకత్వంలో వెన్నపూస రమణారెడ్డి నిర్మిస్తున్నారు, ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్‌కు మంచి స్పందన వచ్చింది. తాజాగా ఈ సినిమాలోని 'మా ఊరు శ్రీకాకుళం' పాటను దర్శకుడు హరీశ్ శంకర్ విడుదల చేశారు. శ్రీకాకుళం గొప్పతనం వివరిస్తూ రామజోగయ్య శాస్త్రి రాసిన పాటను మంగ్లీ పాడారు. సునీల్ కశ్యప్ స్వరపరిచారు. ఈ సందర్భంగా హరీశ్ శంకర్ మాట్లాడుతూ 'ఈ సినిమా టైటిల్ ఫన్నీగా ఉంది. మోహన్ రచయితగా నాకు చాలా కాలం నుంచి తెలుసు. పాట విజువల్స్ బాగున్నాయి. మంగ్లీ బాగా పాడింది. వెన్నెల కిశోర్ నుంచి ఒక డిఫరెంట్ సినిమా ఎక్స్‌పెక్ట్ చేస్తున్నా' అన్నారు. ఈ చిత్రానికి పాటలు: రామజోగయ్య శాస్త్రి, కాసర్ల శ్యామ్, ఫొటోగ్రఫీ: మల్లికార్జున్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: రాజేశ్ రామ్, సమర్పణ: లాస్య రెడ్డి.

ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా



తమిళ అగ్రహీరోలు రజనీకాంత్, కమల్ హాసన్ యాక్షన్ బాట పట్టారు. 'విక్రమ్', 'జైలర్' చిత్రాలతో వీరిద్దరూ తమిళంలోనే కాకుండా పాన్ ఇండియా స్థాయిలో సంచలన విజయాలు అందుకున్నారు. దీంతో తదుపరి చిత్రాలు కూడా ఇదే జానర్లో చేస్తున్నారు. మణిరత్నం దర్శకత్వంలో కమల్‌హాసన్ 'థగ్‌లైఫ్' కూడా యాక్షన్ ప్యాక్డ్‌గా ఉండబోతోంది. అలాగే శంకర్ దర్శకత్వంలో వస్తున్న 'భారతీయుడు 2' చిత్రంలో పోరాట ఘట్టాలపై అంచనాలు భారీ స్థాయిలో ఉన్నాయి. 'జైలర్' ఊపులో రజనీకాంత్ సైతం ఇలాంటి చిత్రాలకు పెద్ద పీట వేస్తున్నారు. ప్రస్తుతం ఆయన హీరోగా రూపొందుతున్న చిత్రం 'వేట్టయాన్'. 'జై భీమ్' ఫేమ్ జ్ఞానవేల్ రాజా దర్శకుడు ఇందులో రజనీకాంత్ ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ పాత్రలో కనిపించనున్నారు. చిత్రీకరణ చివరి దశలో ఉంది. 'వేట్టయాన్' తర్వాత రజనీకాంత్ లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో 'కూలీ' చిత్రం చేస్తున్నారు. అయితే రజనీకాంత్ ఈ సినిమాలో కూడా ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గానే కనిపించనున్నారని కోలీవుడ్ టాక్. మానవ అక్రమ రవాణాను అడ్డుకునే నిజాయితీపరుడైన పోలీస్ ఆఫీసర్‌గా, క్రిమినల్స్‌ను ఏరివేసేందుకు ఎంతకైనా తెగించే ఖాకీగా ఆయన శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారట.

ఈసారి కూడా ఓటమి లేదు



'ఇప్పటిదాకా ఒక్క ఫైట్ కూడా ఓడిపోలేదు, ఈ సారి కూడా ఓడిపోను, బాగా ప్రిపేరయ్యి వచ్చాను... చూసుకుందాం రా' అంటూ ప్రత్యర్థులకు సవాల్ విసురుతున్నారు ప్రభాస్. భారతీయ సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న చిత్రం 'కల్కి 2898 ఏడీ' చిత్రం కోసం ప్రభాస్ చెప్పిన డైలాగ్ ఇది. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. శుక్రవారం చిత్రబృందం రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేసింది. అమితాబ్ బచ్చన్ అశ్వత్థామగా డేరింగ్ స్టంట్స్ చేశారు. కమల్‌హాసన్ పూర్తిగా సరికొత్త లుక్‌లో ఆశ్చర్యపరిచారు. బుజ్జితో కలసి ప్రభాస్ చేసిన సాహసాలు, పోరాట ఘట్టాల్లో దిశా పటానీ మెరుపులతో ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకుంది. ప్రభాస్, దీపికా పదుకొనే జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి నాగ్ అశ్విన్ దర్శకుడు. వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వనీదత్ నిర్మిస్తున్నారు.

ఒదిగి ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతం



ఇటీవలే ముంబైలో 'కల్కి' చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో అమితాబ్ బచ్చన్ నిర్మాత సి. అశ్వనీదత్ పాదాలకు నమస్కరించబోగా, ఆయన సున్నితంగా వారించారు. ఆ తర్వాత అమితాబ్ పాదాలకు అశ్వనీదత్ నమస్కరించారు. అమితాబ్ లాంటి దిగ్గజ నటుడు తన వయసు, స్టార్‌డమ్‌ను పక్కనపెట్టి నిర్మాతకు ఎంతో గౌరవం ఇస్తూ పాదాభివందనం చేయడం ఆయన సంస్కారం, గొప్ప మనసుకు నిదర్శనం అని నెటిజన్లు కొనియాడారు. ఆ సంఘటనపై నిర్మాత అశ్వనీదత్ శుక్రవారం సోషల్ మీడియా వేదికగా స్పందించారు. అసలు అమితాబ్ ఆ రోజు ఈవెంట్‌లో అలా చేస్తారని తాను ఊహించలేదని చెప్పారు. 'నేను తేరుకొని ఆయనకు ప్రతి నమస్కారం చేయడానికి కొంచెం సమయం పట్టింది. అమితాబ్‌బచ్చన్ భారతీయ సినిమా యోధుడు ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన వ్యక్తిత్వానికి మరోసారి అభివందనం చేస్తున్నాన'ని తెలిపారు.





రివర్స్ లవ్‌స్టోరీ

ఆంగ్లంలో 'లవ్' అనే నాలుగు అక్షరాలను రివర్స్ చేస్తే 'ఈవోల్' అని వస్తుంది. ఆ టైటిల్‌తో ఓ రివర్స్ లవ్‌స్టోరీ వస్తోంది. సూర్య శ్రీనివాస్, శివ బొడ్డురాజు హీరోలుగా, జెన్నిఫర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో దర్శకనిర్మాత రామ్ యోగి వెలగపూడి శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ 'ఇద్దరు స్నేహితుల మధ్య కుదిరిన అవగాహన నేపథ్యంలో ఈ సినిమా ఉంటుంది. వాణిజ్య విలువలతో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించాను. హైదరాబాద్, వైజాగ్‌లో షూటింగ్ జరిగింది' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, ఫొటోగ్రఫీ: తేడా బ్యాచ్ సినిమా టీమ్, ఎడిటింగ్: విజయ్.



బుజ్జిమేక.. బుజ్జిమేక

గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'పొట్టేల్'. యువచంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల ముఖ్య పాత్రధారులు. సాహిత్ మోత్కూరి దర్శకుడు. ఇప్పటి వరకూ విడుదలైన మూడు పాటలు ప్రేక్షకుల్ని అలరించాయి. తాజాగా నాలుగో పాటను శుక్రవారం విడుదల చేశారు. 'బుజ్జి మేక.. బుజ్జిమేక' అంటూ సాగే ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, కాలభైరవ పాడారు. శేఖర్‌చంద్ర స్వర పరిచారు. పాటలో విజువల్స్ ఆకట్టుకొనేరీతిలో ఉన్నాయి. హార్ట్ టచింగ్ సాంగ్‌గా దర్శకుడు చిత్రీకరించారు. అజయ్, ప్రియాంక శర్మ, తనస్వి చౌదరి, నోయల్ సీన్, ఛత్రపతి శేఖర్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిశాంక్ రెడ్డి కుడితి, సురేశ్‌కుమార్ నడిగే నిర్మాతలు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/DiKTPSo లో చదవండి.

రాష్ట్ర వ్యాప్తంగా 15 ఐటీఐల్లో 'స్కిల్ ఇండియా'

● బొబ్బిలిలో రూ. 1.5 కోట్లతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ

● ఆర్‌డీడీ ఆర్‌వీ రమణ



మాట్లాడుతున్న ఆర్‌డీడీ ఆర్‌వీ రమణ

బొబ్బిలి, జూన్ 21: రాష్ట్ర వ్యాప్తంగా 15 ఐటీఐల్లో స్కిల్ ఇండియా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగా అందులో విశాఖ రీజియన్ పరిధిలో మూడు ప్రభుత్వ ఐటీఐలు ఉన్నాయని సాంకేతిక విద్య రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వీ రమణ తెలిపారు. బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో మహిళల కోసం ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బొబ్బిలి, రాజాం, విశాఖపట్టణం ఐటీఐలను స్కిల్ ఇండియా కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఒక్క ఐటీఐకి సుమారు 1.5 నుంచి 2.5 కోట్లు కేటాయించనున్నట్టు, కేవలం బొబ్బిలి ఐటీఐలో రూ. 1.5 కోట్లతో విద్యార్థులకు నైపుణ్య శిక్షణకు అవసరమైన మిషనరీ తదితర సౌకర్యాలు కల్పిస్తు న్నట్లు తెలిపారు. విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులను కేంద్రప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. భువనేశ్వర్‌లో గల టూల్ రూమ్ ద్వారా నైపుణ్యాలను కల్పిస్తామన్నారు. పరిశ్రమలతో ఎంఓయూ కుదుర్చుకుని అవసరమైన కోర్సుల్లో విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. ● మూడు జిల్లాల పరిధిలో 17 ప్రభుత్వ ఐటీఐల్లో సుమారు రెండువేల మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, 30 రకాల ట్రేడుల్లో శిక్షణ పొందుతు న్నట్లు తెలిపారు. వందకు పైగా ప్రైవేట్ ఐటీఐలున్నాయని, ఇంజినీరింగ్, డిప్లమా, డిగ్రీ కోర్సులు చేసిన వారు సైతం ఐటీఐల్లో చేరుతున్నారన్నారు. సోలార్ ఎనర్జీ, డ్రోన్ టెక్నాలజీ కోర్సులను ఐటీఐల్లో ప్రవేశపెట్టేందుకు కసరత్తు జరుగుతోందని ఆయన తెలిపారు. ● జాతీయ స్థాయిలో అన్ని ఐటీఐల్లో ఒకే ర కమైన కరిక్యులమ్‌తో బోధన, శిక్షణ ఉంటుందని, ఈ సర్టిఫికెట్‌ను 90 దేశాల్లో వినియోగించుకునే వెసులుబాటు ఉం దన్నారు. గ్లోబల్ లెవె ల్‌లో నిపుణత కలిగిన యూత్‌కు బంగారు భవిష్యత్ ఉందన్నారు. ఈ సమావేశంలో స్థానిక ఐటీఐ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జీవీ రమణారావు పాల్గొన్నారు. ● బొబ్బిలి ప్రభుత్వ ఐటీఐలో మహిళ ల కోసం ఫ్యాషన్ టెక్నాలజీ శిక్షణా శిబిరాన్ని, పలు ల్యాబ్‌లను శుక్రవారం ఆర్‌డీడీ ఆర్‌వీ రమణ ప్రారంభించారు. 18 నుంచి 40 ఏళ్ల లోపు వయస్సు కలిగిన మహిళలకు ఈ శిక్షణ ఇస్తారు. కనీసం 8 వ తరగతి చదువుకున్న వారికి మూడు నెలల పాటు ఉచితంగా ఇక్కడ శిక్షణ పొందవచ్చు. మహిళల ఎంపిక కార్యక్రమాన్ని రోటరీక్లబ్ ప్రతినిధులకు అప్పగించారు. ఒక్కో బ్యాచ్‌లో 30 మందికి చొప్పున శిక్షణ ఇస్తామని అధికారులు తెలిపారు. ప్రిన్సిపాల్ జీవీ రమణారావు, రోటరీక్లబ్ అధ్య క్షుడు జేసీ రాజు, ఇతరప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామసభలు నిర్వహించాలి

శృంగవరపుకోట: పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రిగా బాధ్యతలు తీసుకున్న జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ గ్రామ సభలు సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు కోరారు. శుక్రవారం శృంగవరపు కోట లో విలేకర్లతో మాట్లాడారు. పవన్ కల్యాణ్‌కు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సాంబమూర్తి, అప్పారావు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

జాబ్‌మేళాకు 30 మంది ఎంపిక

విజయనగరం, ఆంధ్రజ్యోతి: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఎంఆర్ కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్‌మేళాకు 67 మంది హాజరయ్యారు. అపోలో టైర్స్, మోడలైజ్ ఇండియా ఫుడ్ ప్రైవేటు లిమిటెడ్, పాపులర్ షూ మార్ట్ సంస్థలు ఈ జాబ్‌మేళాకు హాజరై, తదుపరి దశకు 30 మందిని ఎంపిక చేశారు.. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధి అధికారిణి డి అరుణ, కంపెనీ హెచ్‌ఆర్‌లు బాలకృష్ణ, శ్రీకాంత్, శివకుమార్, యశ్వంత్, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోస్టాఫీసు సేవలు మరింత చేరువ కావాలి

విజయనగరం దాసన్నపేట: పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని డివిజనల్ పోస్టల్ సూపరిడెంట్‌ంట్ కె శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కంటోన్మెంట్‌లోని పోస్టాఫీసులో పోస్టల్ ఇన్‌స్పెక్టరు సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించిన పోస్టల్ మెగా డే సందర్భంగా వివిధ పథకాలు, సేవలపై సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న పొదుపు, బీమా, ఐపీబీపీ తదితర సేవలు ప్రజలకు చేరువ కావాలన్నారు.. ఐపీబీపీ మేనేజరు సతీష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రజలకు ప్రీమియం అకౌంట్స్, ప్రమాద బీమా గురించి ఈ పథకాలను వినియోగించేలా చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టుమాస్టర్ శంకరనాయుడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బొబ్బిలి: బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో గొల్లపల్లి 33/11 కేవీ సబ్ స్టేషన్ నుంచి 11 కేవీ చర్చిసెంటరు ఫీడరు ప్రాంతంలో చెట్ల కొమ్మలు నరికివేత ప్రక్రియలో భాగంగా శనివారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఈఈ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మిగారి కోనేరు కాలనీ, రత్నాలనగర్, సిరిపురపు వీధి, అగురువీధి, ఎస్‌బీఐ కాలనీ, సంఘవీధి, ఆకులరెల్లివీధి, కోరాడ వీధి, మీసదు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నందున వినియోగదారులంతా విద్యుత్ సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

ఐటీఐ ప్రవేశాలకు 48 మంది ఎంపిక

విజయనగరం దాసన్నపేట: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో నూతనంగా ప్రవేశాలు పొందేందుకు మూడో రోజు 111 మంది హాజరవ్వగా, 45 మంది ఎంపికయ్యారు.. హాజరైన విద్యార్థుల ధృవీకరణ పత్రాలను పరిశీలించి ఎంపికలు నిర్వహించారు.. జిల్లా కన్వీనరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ టీవీ గిరి మాట్లాడుతూ, ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశం పొందేందుకు ఆసక్తి కనబరుస్తున్నారని తొలి విడత కౌన్సిలింగు పూర్తయిన వెంటనే ప్రభుత్వం రెండో విడత ప్రవేశాలకు కౌన్సిలింగు నిర్వహిస్తామన్నారు. అర్హులైన అభ్యర్థులు ఐటీఐలో ప్రవేశం పొంది, జీవనోపాధి పొందవచ్చునని అన్నారు.. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రెవెన్యూ సెక్షన్ ఆధునికీకరణ

కలెక్టరేట్: కలెక్టరేట్ సముదాయంలో ఉన్న రెవెన్యూ సెక్షన్‌ను ఆధునీకరించారు. రెవెన్యూ సెక్షన్‌కు సీలింగ్, ఫ్లోరింగ్ వంటి పనులు చేపట్టారు. ఏసీ సదుపాయం కూడా కల్పించారు. అన్ని సెక్షన్‌లకు ప్రత్యేకంగా కౌంటర్లు, ఫర్నీచ ర్ ఏర్పాటు చేస్తున్నారు. కలెక్టరేట్ పరిపాలన అధికారికి ప్రత్యేకంగా చాంబర్‌ను సమకూర్చారు. ఆధునీకరించిన సముదాయం నాలుగు ఐదు రోజుల్లో ప్రారంభించనున్నారు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

వేపాడ: బక్కునాయుడుపేట ఏపీ గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థునులతో దరఖాస్తులు కోరుతున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ టీఎం ఫ్లోరెన్స్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27వ తేదీలోగా పాఠశాలకు దరఖాస్తులు అందించాలన్నారు. అదే రోజు విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఉంటుందని, ఇందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థునులకు పాఠశాలలో ప్రవేశం లభిస్తుందని తెలిపారు.

విద్యాసంస్థల తీరుకు వ్యతిరేకంగా ధర్నా

బొబ్బిలి: బొబ్బిలి ప్రాంతంలో యథేచ్ఛగా విద్యా వ్యాపారాలను జోరుగా సాగిస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం ముందు ఏపీఎస్ జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రెండువందలమంది విద్యార్థులతో స్టేట్ హైవే పక్కనే నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. పుస్తకాలు, యూనిఫాం దుస్తుల మార్కెట్ కూడా అందులోనే నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఇంత పబ్లిగ్గా విద్యావ్యాపారం సాగిస్తుంటే అధికారులు ఏమాత్రం స్పందించకపోవడం పలు అనుమానాలకు దారితీస్తోందన్నారు. కార్యాలయం ముందు నినాదాలు చేసిన అనంతరం ఆర్డీవో సాయిశ్రీకి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.అనిల్‌కుమార్, రాజేశ్, మహేశ్, కూర్మా రావు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న న్యాయాధికారి

బొబ్బిలి: బొబ్బిలి కోర్టు సముదాయంలో ఈ నెల 29న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక కోర్టులో న్యాయవాదులు, పోలీసు, ఎస్‌ఈబీ అధికారులతో అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు జరుగుతున్న జాతీయలోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కక్షిదారుల్లో అవగాహన కల్పించాలన్నారు. కోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి, సత్వర న్యాయం కోసం జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి ఎస్.అరుణశ్రీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణి రావు, సీఐలు మలిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్.తిరుమలరావు, బార్‌అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు మోహన మురళీ కుమార్, సింహాచలం పాల్గొన్నారు.

కల్యాణ వేంకటేశ్వరునికి వసంతోత్సవం



వేంకటేశ్వరునికి పూజలు చేస్తున్న దృశ్యం

జామి, జూన్ 21: మండలంలోని కుమరాం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యం లో వసంతోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

ప్రపంచంలో మూడో స్థానంలో భారత్



మాట్లాడుతున్న డా.సతీష్ రెడ్డి

రాజాం రూరల్, జూన్ 21: దేశంలో అనేక రంగాల్లో అభివృద్ధి సాధ్యపడు తుందని, ప్రధానంగా విద్యారంగంలో పరిపూర్ణమైన అభివృద్ధి జరగడం ద్వారా పరిశో ధన పత్రాల సమర్పణ, పీహెచ్‌డీ డిగ్రీల సాధనలో భారత్ ప్రపంచంలోనే మూడో స్థానంలో ఉందని డీఆర్‌డీవో మాజీ చైర్మన్, రక్షణమంత్రి శాస్త్రీయ సలహాదారు డా.జి.సతీష్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక్కడి జీ.ఎం.ఆర్.ఐ.టి.లో శుక్రవారం నిర్వహించిన కళాశాల తొమ్మిదో స్నాతకోత్సవంలో కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అంతరిక్ష రంగంలో పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో పీఎస్ఎల్వీ, జీఎస్ఎల్వీ, క్రయోజనిక్ ఇంజన్లు తక్కువ ఖర్చుతో తయారుచేసి వందలాది ఉపగ్రహాలను మనదేశంలోనే విజయవంతంగా ప్రయోగిస్తున్నామని ఆయన గుర్తుచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బంగారు, వెండి పతకాలతో పాటు డిగ్రీలను ప్రదానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ప్రసాద్ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవ కార్యక్రమంలో డా.జె.గిరీష్, ఎల్.ఎం. లక్ష్మణమూర్తి, అశ్వని లోహానీ, అలెక్సిస్ రియల్స్, అగస్టీన్ రోమనెట్, ఎం.వి.నాగేశ్వర్రావు తదితరులు పాల్గొన్నారు.

రిలే దీక్షల్లో జేఎస్ఎల్ కార్మికులు



రిలే దీక్షలు చేస్తున్న కార్మిక సంఘం నాయకులు

కొత్తవలస, జూన్ 21 : మండలంలోని జేఎస్ఎల్ కార్మికులు తమ ఆందోళనను రోజురోజుకూ ఉధృతం చేస్తున్నారు. కర్మాగారం మెయిన్ గేట్ వద్ద శుక్రవారం నుంచి వంటా వార్పు, నిరసన కార్యక్రమాలతో పాటు రిలే నిరాహార దీక్షలను మొదలు పెట్టారు. శుక్రవారం కర్మాగారానికి చెందిన మూడు కార్మిక సంఘాలకు చెందిన నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు, బూసాల అప్పారావు, బాలిబోయిన ఈశ్వరరావు, సింగంపల్లి ఎర్నాయుడు, జిన్నాల రామునాయుడు, కె.అప్పారావు, రామేశ అచ్చిబాబు,జేవిఆర్ రాజు,ఇందలి అమ్మాజీ, బండారు రామలక్ష్మి దీక్షలు చేశారు. వీరికి జేఏసీ గౌరవాధ్యక్షుడు నెక్కల నాయుడుబాబు, సీఐటీయు జిల్లా కార్యదర్శి సురేష్, అప్పన్నపాలెం, ఉత్తరాపల్లి సర్పంచ్‌లు కోన దేముడు, సింగంపల్లి గణేష్ సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు నెక్కల నాయుడు బాబు మాట్లాడుతూ కార్మికులు తమ న్యాయమైన సమస్య కోసం పోరాటం చేస్తున్నారన్నారు. గత 36 రోజులుగా కార్మికులు నిరసన కార్యక్రమాలు చేస్తున్నా యాజమాన్యంలో సరైన స్పందన లేకపోవడం వలనే వివిధ రూపాలలో ఆందోళన చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జిల్లా సీఐటీయూ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ కార్మికుల న్యాయమైన సమస్యను పరిష్కరించక పోతే ఎలా? అని ప్రశ్నించారు. కార్మికులు లాకౌట్ ఎత్తి వేస్తే యాజమాన్యానికి పూర్తి సహకారం అందిస్తామని చెబుతున్నారన్నారు. కార్మికులందరికి లే ఆఫ్ లేదా కర్మాగారంలో కార్మికులందరికీ 21 రోజులు పని కల్పించాలని కోరుతున్నారన్నారు. కార్మికులు కారణంగా లాకౌట్ విధించ లేదని, యాజమాన్యంకు ఉన్న సమస్యలు కారణంగానే లాకౌట్ చేశారన్నారు.

పైడిమాంబకు చీర బహూకరణ



అలంకరణలో అమ్మవారు

విజయనగరం రూరల్, జూన్ 21: గాన కోకిల, పద్మవిభూషణ్ సుశీల పైడిమాంబకు పట్టు చీరను తమ బంధువుల ద్వారా దేవస్థానం అధికారులకు గురువారం సమర్పించారు. ఈ చీరను ఆలయ అర్చకులు శుక్రవారం పైడి మాంబకు సమర్పించారు. అదే విధంగా పైడి మాంబను వివిధ రకాల పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు నిర్వహించారు.

22న చండీహోమం

పైడిమాంబ ఆలయాలు (వనం, చదురుగుడి)ల్లో శనివారం చండీహోమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈవో ప్రసాద్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. పైడిమాంబ నక్షత్రంతో పాటు పున్నమి కలిసి రావడంతో ఈ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పౌష్టికాహారంపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సీడీపీవో రాజ్యలక్ష్మి

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారం సమృద్ధిగా అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీడీఎస్ సీడీపీవో కే.రాజ్యలక్ష్మి తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం పోషణపై అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా సెంటర్లలో పౌష్టికాహారం లోపం వల్ల పిల్లల్లో ఎదుగుదల మందగిస్తోందని, దీనిని నిరోధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. చిరుధాన్యాలు, మానసిక అభివృద్ధి, బరువు పెరుగుదల వంటి వాటిపై విస్తృతమైన అవగాహన కల్పించాలని తెలిపారు. దీనిపై అంగన్‌వాడీ సిబ్బంది ఎక్కువగా శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉన్న ఆరో అంగన్‌వాడీ కేంద్రంలో యోగా దినోత్సవంలో సీడీపీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా చేయడం వలన కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కే.కృష్ణకుమారి, సూర్యకళ, ఆరవ సెంటర్ అంగన్‌వాడీ కార్యకర్త జి.లక్ష్మి, ఆరికతోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది చినబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లోడ్‌పై కేసులు పెట్టడం లేదు: ఏఈ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

లక్కవరపుకోట: వినియోగదారులు వాడుతున్న విద్యుత్ లోడుపై కేసులు నమోదు చేస్తున్నామని వచ్చిన వార్తలు నిజంకాదని, వారి సౌలభ్యం కోసం లోడ్ పెంచుతున్నామని విద్యుత్‌శాఖ ఏఈ ఐ.కృష్ణ తెలిపారు. 'విద్యుత్ లోడ్ పేరుతో కేసులు' అనే కథనం శుక్రవారం ఆంధ్రజ్యోతిలో వెలుడింది. దీనిపై స్పందించిన ఏఈ లోవోల్టేజీ సమస్యను అధిగమించడానికి, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి లోడ్‌చెకింగ్ చేస్తున్నామని తెలిపారు. అవి కేసులు కాదన్నారు. వినియోగాన్ని బట్టి ఆయా గ్రామాల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఎల్.కోటలో మూడు, కల్లేపల్లి, గనివాడ, కొట్యాడ, భీమిలి గ్రామాల్లో ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు సహక రించాలన్నారు.

విద్యా రంగాన్ని సర్వనాశనం చేశారు

విజయనగరం దాసన్నపేట: రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్‌గా ప్రవీణ్‌ప్రకాష్ విద్యా రంగాన్ని సర్వనాశనం చేశారని ఉపాధ్యాయ సంఘ నేత బంకపల్లి శివప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థిరమైన వ్యక్తిత్వం లేక మతిస్థిమితం కోల్పోయి విద్యా రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. జీఓ నెంబరు 117ని అమలు చేసి అనేక పాఠశాలలు మూతపడే విధంగా చేశారన్నారు. నిజాయితీపరుడు అని చెప్పుకుంటూ మానసిక వైకల్యం కలిగిన ప్రవీణ్ ప్రకాష్ వేలల్లో అక్రమ బదిలీలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. విద్యార్థులు ముందు ఉపాధ్యాయులను, ఉపాధ్యాయుల ముందు అధికారులను ఇష్టానుసారం దూషించడంతో తన పైశాచికత్వాన్ని ప్రదర్శించారన్నారు. ప్రవీణ్‌ప్రకాష్‌ని ప్రభుత్వం సాగనంపిన తీరు చూసి ఉపాధ్యాయ లోకం ఆనందాన్ని ఆస్వాదిస్తున్నదన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

● పారబోసిన విద్యార్థులు

● జామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘటన



ఉప్మాను పరిశీలిస్తున్న మండల విద్యాశాఖాధికారి జయశ్రీ

జామి, జూన్ 21: మండల కేంద్రమైన జామి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థులకు పెట్టిన మధ్యాహ్న భోజనంలో పురుగులు కనిపించాయి. దీంతో విద్యార్థులు ఎవ్వరూ ఈ భోజనం తినకుండా చెత్తబుట్టలో పడేశారు. ఆకలితో తరగతులకు వెళ్లిపోయారు. మరోసారి అన్నం వండించి పెడ తామని ఉపాధ్యాయులు చెప్పినా మళ్లీ పురుగుల అన్నం పెడతారేమో అని వద్దన్నారు. దీంతో మధ్యాహ్నం మూడుగంటల సమయంలో ఉప్మా వండిపె ట్టించారు. ఈ విషయంపై పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ఈ పాఠశాలలో నిర్వహణ బాగోలేదని విద్యాశాఖ సక్రమంగా స్పందించడం లేదని వాపోయారు. మధ్యాహ్నభోజనం పురుగుల విషయంపై ఏంఈవో జయ శ్రీను వివరణ కోరగా తన దృష్టికి వచ్చిన వెంటనే వెళ్లి పరిశీలించామని, భోజ నంలో పెంకిపురుగులు వచ్చాయని తెలిపారు. దీంతో ఉప్మా తయారుచేయించి పెట్టించామని, మరోసారి ఇలా జరగకుండా చూ స్తామన్నారు. ఇదే విషయంపై టీడీపీ మండలపార్టీ కార్యదర్శి వర్రి రమణ మా ట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులకు ఎటువంటి ఆహారం పెట్టినా గత ప్రభు త్వంలో చూసీ చూడకుండా వదిలేశారని, ఈ ప్రభుత్వంలో అటువంటివి ఉండవని, విద్యార్థుల ఆరోగ్యంతో ఆటలాడితే చర్యలు తప్పవన్నారు.

చేయూత నిధులు అందరికీ వచ్చేలా చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న మండల విద్యాశాఖాధికారి శ్రీదేవి

కొత్తవలస, జూన్ 21: మండలంలో చాలా గ్రామాలకు చెందిన మహిళలకు చేయూత, ఆసరాకు సంబంధించిన డబ్బులు బ్యాంక్ అకౌంట్‌లలో జమ కాలేదని వాటిని పరిశీలన చేయాలని ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావును జడ్పీటీసీ నెక్కల శ్రీదేవి కోరారు. శుక్రవారం మండలపరిషత్ కార్యాలంలో ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చేయూత, ఆసరాకు సంబంధించిన నిధులు కొంతమందికి మాత్రమే జమ అయ్యాయని చాలా మందికి జమకాలేదన్నారు. కొత్తవలసకు చెందిన శ్మశానంలో సీఎస్ఆర్ నిధులు కింద షెడ్డును నిర్మాణం చేయడానికి అనుమతి మంజూరు చేయాలని తెలుగుదేశం ఎంపీటీసీ వేలమూరి సూర్యనారాయణ ఎంపీడీవో రమణయ్యను కోరారు. మండలంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు లేవని విద్యుత్‌శాఖ ఏఈ ఇమంది అప్పారావు చెప్పగా అప్పన్నదొరపాలెం గ్రామంలో సమస్య ఉందని సర్పంచ్ రాములమ్మ ఏఈ దృష్టికి తీసుకొచ్చారు. వయోజనులందరూ టీబీ నిరోధానికి సంబంధించిన టీకాలను వేసుకోవాలని, ఈ టీకా వలన ఎటువంటి సైడ్‌ఎఫెక్టు ఉండదని కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి సీతాలక్ష్మితెలిపారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో బడికి పోదాం రా అనే కార్యక్రమాన్ని ముమ్మరంగా చేస్తున్నామని మండల విద్యాశాఖాధికారులు శ్రీదేవి, శ్రీనువాసరావు తెలిపారు. ఉపాధి హామిపథకానికి సంబంధించిన పనులను ఉద్యాన వన పంటలకు అనుసంధానం చేయడం జరిగిందని ఆశాఖ అధికారి జనార్దనరావు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ చంద్రశేఖర్, పీఆర్ డీఈ స్వామి నాయుడు,ఈఓపీఆర్డీ ధర్మారావు వైస్‌ఎంపీపీలు కర్రిశ్రీను, మేలాస్త్రి సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

చీకట్లో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

● ఉక్కపోతతో అల్లాడిన రోగులు



చీకట్లోనే చికిత్స పొందుతున్న రోగులు

రింగురోడ్డు: నగరంలో మహరాజా ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలు తప్పడం లేదు. తాజాగా శుక్రవారం రాత్రి చిన్నపాటిగా కురిసిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా వార్డుల్లో ఉన్న రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ నిలిచిపోడంతో ఉక్కబోతతో రోగులు, సహాయకులు ఉక్కిరిబిక్కిరయ్యారు. జనరేటర్ పనిచేయకపోవడంతో ఆసుపత్రి ఆవరణలో చీకట్లు అలుముకున్నాయి. ఇలా ప్రతి సారి చిన్నపాటి వర్షానికే కరెంట్ పోవడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

● తల్లిదండ్రులకు తీవ్ర గాయాలు



గణేష్ (ఫైల్)

గంట్యాడ, జూన్ 21: రోడ్డు ప్రమాదంలో మూడేళ్ల బాలుడు మృతి చెందగా అతని తల్లితండ్రులకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి స్థానికులు, గంట్యాడ ఎస్ఐ సురేంద్ర నాయుడు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని డొంకాడ గ్రామానికి చెందిన శీర శ్రీను, భార్య మౌనిక, మూడేళ్ల కుమారుడు గణేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై నెల్లిమర్ల మండలం కొండగుంపాం గ్రామంలోని అత్తవారింటికి శుక్రవారం ఉదయం వెళ్లారు. అక్కడి నుంచి తిరిగి విజయనగరం వెళ్లి పనిచూసుసకుని, అక్కడి నుంచి స్వగ్రామైన డొంకాడకు బయలుదేరారు. ఇలా వస్తుండగా గంట్యాడ పోలీసుస్టేషన్ దాటేసరికి తాటిపూడి నుంచి విజయనగరం వైపు వస్తున్న కారు ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మూడేళ్ల బాలుడు గణేష్ అక్కడికక్కడే మృతి చెందగా, శ్రీను, మౌనికతోపాటు కారు డ్రైవర్ జనార్దన్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని 108 వాహనంపై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. శ్రీను పరిస్థితి విషమించడంతో విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించారు. ఘటనా స్థలానికి విజయనగరం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ సురేంద్ర నాయుడు చేరుకుని పరిశీలించారు. గరివిడి మండలం కాపుసంభాం గ్రామానికి చెందిన కారును డ్రైవర్ జనార్దన్ అరుకు తీసుకుని వెళ్లి తిరిగి కాపుసంభాం వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెరువులో పడి వ్యక్తి..



మహేష్ (ఫైల్)

వంగర, జూన్ 21: స్నానానికి దిగిన వ్యక్తి చెరువులో పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై జనార్దన్‌రావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అరసాడకు చెందిన దారసింగ్ మహేష్(36) తన ఇద్దరు పిల్లలతో కలిసి శివాలయం వద్ద ఉన్న మంచినీటి చెరువుకు స్నానానికి వెళ్లాడు. పిల్లలకు స్నానం చేయించి అనంతరం తాను స్నానానికి దిగాడు. స్నానం చేస్తుండగా మహేష్ ఒక్కసారిగా మునిగిపోయి బయటకు రాకపోవటంతో పిల్లలు గట్టిగా కేకలు వేశారు. దీంతో స్థానికులు వచ్చి, మహేష్‌ను బయటకు తీసి హుటాహుటినా రాజాం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలపటంతో కుటుంబ సభ్యులు విలపించారు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడికి భార్య అప్పమ్మతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జనార్దనరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ..

గంట్యాడ: ఉపాధి కోసం వలస వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాందంలో ఓ మహిళ ప్రాణాలు విడిచింది. దీనికి సబంధించి గంట్యాడ ఎస్ఐ సురేంద్రనాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మెంటాడ మండలం కొంపంగికి చెందిన సారిక త్రినాథ, అశ్విని దంపతులు పిల్లలతో కలిసి తాడేపల్లి గూడెం వెళ్లారు. అక్కడ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తిరిగి కుటుంబ సమేతంగా స్వగ్రామానికి వచ్చేందుకు సిద్ధమై తాడేపల్లి గూడెంలో గురువారం రాత్రి బయలుదేరారు. ఓ అద్దె బొలేరో వాహనంలో సామగ్రితో కుటుంబసమేతంగా కొంపంగి వస్తుండగా గురువారం అర్ధరాత్రి దాటాక విజయనగరం మండలం చెల్లూరు బైపాస్ రోడ్డుపై వాహనం డివైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో అశ్విని(27)రోడ్డుపై పడి గాయపడగా స్థానికులు విజయనరగం ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. భర్త త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో బోల్తా.. ఒకరికి గాయాలు

కురుపాం రూరల్: నీలకంఠాపురం-ధర్మలక్ష్మీపురం గ్రామాల మధ్య ఆటో బోల్తా పడిన ఘటలో ఒక వ్యక్తి గాయపడ్డాడు. ఎదురుగా వస్తున్న మ్యాక్సీ కేబ్‌ను తప్పించబోయి ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న హిమరిక కృష్ణారావుకు తీవ్ర గాయాలు కాగా ఫీడర్ అంబులెన్సులో నీలకంఠాపురంలోని పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్లు సీజ్

రేగిడి: మండలంలో బొడ్డవలస నాగావళీ తీరంలో వంతెనలు, రక్షిత మంచి నీటి సోర్స్ వద్ద అక్రమక్వారీలపై రెవెన్యూ యంత్రాంగం దృష్టి సారించింది. శుక్రవారం తహసీల్దార్ రాములమ్మ సంకిలి వద్ద నాలుగు టాక్టర్లను అదుపులో తీసుకొని సీజ్‌చేసి రేగిడి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించారు. బొడ్డవలస, రేగిడి రక్షిత బావుల వద్ద ఇసుక అక్రమరవాణ నియంత్రణకు ఇతర నిషావిభాగాలతో మాట్లాడి ప్రత్యేక పటిష్ఠ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి



ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజును సత్కరిస్తున్న పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్

దాసన్నపేట, జూన్ 21: విజయనగరం నియోజవర్గ ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీ సాధించి ప్రమాణస్వీకారం చేసిన అదిత విజయలక్ష్మి గజపతిరాజు భవిష్యత్‌లో ఉన్నత పదవులు అధిరోహించాలని సీనియర్ నాయకులు పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ కోరుకున్నట్టు తెలిపారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మర్యాపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాడు అప్పారావు, రౌతు చంటి, ఈగల అజయ్, సోము నాయుడు, బేత రవి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్‌సాగుకు ఏరువాకతో రైతులు సన్నద్ధంకావాలి

రేగిడి: ఖరీఫ్‌సాగుకు రైతులు ఎరువాకతో సన్నద్ధం చేస్తున్నట్లు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు నారు జనార్దనరావు తెలిపారు. శుక్రవారం సంకిలిలో తన పొలంలో జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు జనార్దనరావు ఎరువాక పౌర్ణమి కార్యక్రమంలో భాగంగా నాగళిపట్టి ఖరీఫ్‌సాగు దుక్కిదున్నే ప్రక్రియ చేపట్టారు. ఎరువాక పౌర్ణమి రోజునుంచి ఖరీఫ్‌సాగుకు అనువైన రోజులని, రైతులు గ్రహించి ముందుకు రావాలని కోరారు. రైతులందరికీ కావాల్సిన విత్తనాలు అందుబాటులో ఉండేవిధంగా కొత్తప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సాగునీటి ప్రాజెక్టులు మరమ్మతులపై ఈప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఆదర్శ రైతులుగా గుర్తించిన సంకిలికి చెందిన రైతులు బాన్న అప్పారావు, గుండ దామోదర్, నారు పట్టాభినాయుడు, ఆకుల మన్మథరావు, వరదరాజు తదితరులకు రైతుసంఘం తరుపున సన్మానం చేశారు.

యోగాతో ఆరోగ్యం

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా యోగా దినోత్సవం
- ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో యోగాసనాలు


మక్కువ: ఉపాధి వేతనదారులతో..


పార్వతీపురంటౌన్: శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


పాలకొండ: జూనియర్ సివిల్ న్యాయాధికారి రాజ్‌కుమార్..


సాలూరు: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


గరుగుబిల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో..


పాచిపెంట: పాంచాలి హైస్కూల్‌లో..


భామిని: ఆదర్శ పాఠశాలలో..


వీరఘట్టం: యోగాసనాలు వేస్తున్న ఉపాధి వేతనదారులు


కురుపాం కోర్టులో..


సాలూరు రూరల్: మాతుమూరులో..


సీతానగరంలో..

ఘనంగా ఏరువాక పౌర్ణమి


ఏరువాక పౌర్ణమి నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొండ: కొండాపురం గ్రామంలో శుక్రవారం ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమిని ఘనంగా నిర్వహించారు. ఎద్దులను ముస్తాబు చేసి నాగలి పూశారు. తోటపల్లి కాలువల ఆధునికీకరణ పనుల సాధన సమితి అధ్యక్షుడు చేబోదుల లక్ష్మీనారాయణ జెండా ఊపి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ రైతుల పర్వదినంగా భావించే ఏరువాక పౌర్ణమి రోజున రాష్ట్రంలో కొత్తగా ఎన్‌డీఏ ప్రభుత్వం కొలువుదీరడం శుభసూచికమన్నారు. అయితే తోటపల్లి కాలువల ఆధునికీకరణ, జంపరకోట రిజర్వాయర్‌ను పూర్తి చేసేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. భామిని మండలంలో ఉన్న కొండలోవ గెడ్డ రిజర్వాయర్ పనులు, కురుపాం నియోజకవర్గంలో ఉన్న ఒట్టిగెడ్డ రిజర్వాయర్ ఆధునికీకరణ, పార్వతీపురం నియోజకవర్గంలో ఉన్న జంఝావతి రిజర్వాయర్ పనులకు అడ్డంకిగా ఉన్న ఒడిశాతో ఒప్పందం అత్యవసరమన్నారు. కార్యక్రమంలో కనపాక చౌదరి నాయుడు, సర్పంచ్ రాయపు వనజ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కిమిడి రామ్మూర్తి, బలగ దుర్గారావు, మజ్జి సన్యాసినాయుడు, పామోటి వైకుంఠరావు, యందవ సూరిబాబు, లంక మోహన్, బలగ లక్ష్మణనాయుడు, పారినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నీటి నాణ్యత కిట్లు పంపిణీ


నీటి నాణ్యత కిట్లుతో సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొమరాడ: గ్రామీణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పరీక్షించి ప్రజలకు సురక్షిత నీటిని సరఫరా చేసేందుకు నీటి పరీక్ష కిట్లను పంపిణీ చేసినట్లు మండల నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'కాలం చెల్లిన నీటి పరీక్ష కిట్లు' పేరిట కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు నూతనంగా కిట్లను అందించారని ఆయన చెప్పారు. గ్రామాల్లో నీటి పరీక్షలను చేపట్టి సురక్షితమైన తాగునీరు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. నూతనంగా పంపిణీ చేసిన కిట్లుకు 2026 సంవత్సరం వరకు నాణ్యత పరీక్షలు ఉపయోగించే రసాయనాలు, ఔషదాల గడువు ఉన్నట్లు ఇంజినీరింగ్ అధికారి తెలిపారు.

మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- డీఆర్‌డీఏ పీడీ సత్యంనాయుడు


మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న పీడీ సత్యంనాయుడు

గరుగుబిల్లి: మహిళా సంఘాల సభ్యులకు మంజూరు చేస్తున్న రుణాలతో మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పార్వతీపురం మన్యం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వై.సత్యంనాయుడు అన్నారు. పెద్దూరులో మహిళా సంఘాల సభ్యులకు వ్యాపారాలు చేసుకునేందుకు మంజూరు చేసిన రుణాలతో ఏర్పాటు చేసుకున్న షాపులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ప్రస్తుతం బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న మహిళా సంఘాల సభ్యులకు తగు సూచనలు, సలహాలు అందజేశారు. అనంతరం పీడీ సత్యంనాయుడు మాట్లాడారు. మహిళా సంఘాలు తీసుకున్న రుణాలతో చిన్న చిన్న వ్యాపారాలకే పరిమితం కాకుండా పెద్ద వ్యాపారాలు చేసేందుకు ముందుకు రావాలని కోరారు. మహిళలు ఆర్థికంగానే కాకుండా వ్యాపారవేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందజేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం పెదిరెడ్ల అప్పలనాయుడు, సీసీలు చందాన తిరుపతిరావు, కింజంగి కృష్ణ, వీవోఏ బొబ్బిలి జ్యోతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన ఉండాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట: రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు, ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి స్పష్టం చేశారు. శుక్రవారం సీతంపేట పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో రహదారి ప్రమాదాలపై నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు, మ్యాక్సీ పికప్ డ్రైవర్లు, మినీ వ్యాన్ డ్రైవర్లు వాహనాలు నడిపేటప్పుడు నిబంధనలు మేరకు వాహనాలు నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, ప్రతి ఒక్కరి దగ్గర లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. అనంతరం స్థానిక బస్టాండ్ నుంచి సంతమార్కెట్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో సీతంపేట ఎస్‌ఐ జగదీష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సమాన అవకాశాలు ఇవ్వాలి


నీలకంఠాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కురుపాం రూరల్: ఆడపిల్లలకు సమాన అవకాశాలు ఇవ్వాలని, వారిని చదివించండి, రక్షించండి.. అంటూ ఐసీడీఎస్ శాఖ తరపున నీలకంఠాపురం గ్రామంలో శుక్రవారం ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసరు విజయగౌరి మాట్లాడుతూ ఆడపిల్లలను చదివిస్తే వారు సమాజంలో నిలదొక్కుకుంటారని చెప్పారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై ఆడపిల్లలకు అవగాహన కల్పించాలని కోరారు. బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ మేరకు కళాజాత బృందాలతో అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కార్యకర్తల సమష్టి కృషితోనే విజయం


వేణుగోపాల్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మక్కువ: సాలూరు ఎమ్మెల్యే, రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విజయానికి కారణమైన మండల కూటమి శ్రేణుల సమష్టి కృషి అభినందనీయమని టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ అన్నారు. స్థానిక శ్రీరామ నర్సింగ్ హోం ఆవరణలో మండలంలోని 21 పంచాయతీల కూటమి శ్రేణులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి.మల్లేశ్వరరావు, అక్కేన మధుసూదనరావు, బొంగు వాసు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

పిల్లలను బడికి పంపండి


నాయుడుమల్లిలో బడికి పోతా కార్యక్రమంలో అన్నదొర

సీతంపేట: విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపాలని, పనికి కాదని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి అన్నదొర సూచించారు. నాయుడుమల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన బడికి పోతా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తుందని, వీటిని సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను బడిలో చేర్పించాలన్నారు. చదువుకోవడానికి ముందుకు వచ్చిన విద్యార్థులకు వసతిగృహాల్లో ప్రవేశాలు లేవంటూ తిప్పి పంపవద్దని డీడీ ఆదేశించారు. అనంతరం గ్రామంలో తల్లిదండ్రులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఉపవిద్యాశాఖాధికారి పాలక నారాయుడు, ఎంఈవో పి.కోటిబాబు, ఇన్‌చార్జి హెచ్‌ఎం ఏవీ శ్రీనివాస్, సీఎంవో చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి


పిల్లలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న సూపర్‌వైజర్లు లక్ష్మి, అరుణకుమారి

గరుగుబిల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివిన పిల్లలను తమ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని రావివలస, పెదగుడబ సెక్టార్ల సూపర్‌వైజర్లు రౌతు లక్ష్మి, అరుణకుమారి అన్నారు. మండలంలోని పెదగుడబ, తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం గ్రాడ్యుయేషన్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకున్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమం అనంతరం 1వ తరగతిలో చేరేందుకు అర్హత పొందిన పిల్లలకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు చింతాడ గౌరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి ఆలయ స్థల వివాదం


కంచె వేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఆలయ అభివృద్ధి సంస్థ ప్రతినిధులు

గరుగుబిల్లి: తోటపల్లి ఆలయ ప్రాంగణంలో ఉన్న స్థలంపై శుక్రవారం వివాదం చోటుచేసుకుంది. రెండు రోజుల కిందట ఆలయ ముఖ ద్వారానికి ఆనుకుని ఉన్న ప్రాంతాన్ని ఆలయ అభివృద్ధి సంస్థ ప్రతినిధులు చదును చేసి, వాహనాల నిలుపుదలకు అవసరమైన చర్యలు చేపట్టారు. అయితే తోటపల్లి గ్రామానికి చెందిన గణేష్‌రాజు, కుటుంబ సభ్యులు ఈ స్థలంలో శుక్రవారం కంచె ఏర్పాటు చేశారు. గణేష్‌రాజుకు నెల్లిమర్లలో ఉంటున్న ఓ పార్టీ ప్రతినిధి మద్దతుగా నిలిచారు. స్తంభాలు ఏర్పాటు చేసి, మట్టి చదును చేస్తుండగా ఆలయ అభివృద్ధి ప్రతినిధులు, గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ స్థలం తమది అని, గత 30 ఏళ్లగా ఇక్కడే వ్యాపారం చేసుకుంటున్నామని గణేష్‌రాజు చెప్పారు. దీనిపై ఆలయ అభివృద్ధి సంస్థ ప్రతినిధులు డా.డి.పారినాయుడు, ఎం.పకీరునాయుడు, ఎం.వాసునాయుడు, సీతంనాయుడు తదితరులు శుక్రవారం గరుగుబిల్లి తహసీల్దార్, ఎస్‌ఐ, చినమేరంగి సీఐలతో పాటు దేవదాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

యుద్ధ ప్రాతిపదికన బోరు ఏర్పాటు


దండుసూరగూడలో బోరు తవ్వుతున్న దృశ్యం

కురుపాం రూరల్: నీలకంఠాపురం పంచాయతీ దండుసూరగూడ గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. గ్రామంలో వాటర్ ట్యాంకు ఉన్నప్పటికీ బోరు ఎండిపోవడంతో 150 గిరిజన కుటుంబాలు నీటి కోసం నానా ఇబ్బందులు పడ్డారు. ఈ మధ్య గ్రామస్థులు శ్రమదానం చేసి ఓ నేల బావిని తవ్వుకున్నారు. పరిస్థితి సమీక్షించిన గ్రామీణ నీటిసరఫరా విభాగం వారు గ్రామానికి బోరు మంజూరు చేయగా నీలకంఠాపురం సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు ఆధ్వర్యంలో శుక్రవారం బోరు తవ్వారు. దీంతో గ్రామస్థుల దాహార్తి తీరగలదని భావిస్తున్నారు.

కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా బోర్లు

సాలూరు రూరల్: కొఠియా గ్రూపు గ్రామాల్లో ఒడిశా రిగ్గు బోర్లు వేస్తున్నది. పగులుచెన్నారు, పట్టుచెన్నారు తదితర గ్రామాల్లో ఒడిశా అధికారులు రిగ్గు ద్వారా తాగునీటి బోరు తవ్వకాలు చేపట్టారు. కొఠియా గ్రూపు గ్రామాల్లో తాగునీటి సౌకర్యాలున్నా కొత్తగా ఒడిశా రిగ్గు ద్వారా బోర్లు తవ్వకాలు చేపట్టడం విశేషం.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవత ఉత్సవాలు


అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న దృశ్యం

రాయగడ: రాయగడ గ్రామదేవత బురదల పోలమ్మ అమ్మవారి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వీధి వీధిన ఘటాల ఊరేగింపు నిర్వహిస్తున్నారు. అమ్మవారి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపం వద్ద యజ్ఞ, హోమాలు, లలితా సహస్ర నామార్చన, గీతాపారాయణం, కుంకుమ పూజ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పూజా కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. అమ్మవారి దర్శనం కోసం పట్టణంలోని ప్రజలు తండోపతండాలుగా వస్తున్నారు. ఎండలో వస్తున్న భక్తులకు వివిధ సంఘాల వారు మజ్జిగ, పళ్లరసాలు అందజే స్తున్నారు. ఈనెల 26తో ఉత్సవాలు ముగుస్తాయని పూజా కమిటీ సభ్యులు తెలిపారు.

యోగాతో మానసిక ప్రశాంతత


యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

రాయగడ: భారతీయ యోగా, శారీరక, మానసిక ఆరోగ్యానికి ఓ దివ్యమైన ఔషధమని రాయగడ అటానమస్ కళాశాల ప్రిన్సిపల్ బాబిలత షారాఫ్ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కళాశాలలో యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడు తూ.. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం లభిస్తుందని, దీంతో మనిషి ఎలాంటి క్లిష్ట పరిస్థితులైన ఎదుర్కోగలడని చెప్పారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడిశా

పారితోషికం ఇప్పించండి మహాప్రభో

- రెవెన్యూ కార్యాలయం ఎదుట సిబ్బంది నిరసన


నిరసన తెలుపుతున్న సిబ్బంది

చీపురుపల్లి: ఎన్నికల్లో విధులు నిర్వహించిన తమకు పారితోషికం తక్షణమే ఇప్పించాలని కోరుతూ రెవెన్యూ సిబ్బంది స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఎన్నికలు ముగిసి, ప్రభుత్వం కొలువు తీరినప్పటికీ, తమకు రావాల్సిన పారితోషికం ఇవ్వకపోవడం విచారకరమన్నారు. గత నెల 13న పోలింగ్ జరిగినది మొదలుకొని జూన్ 4న జరిగిన ఓట్ల లెక్కింపు వరకూ తామంతా పలు రకాలుగా విధులు నిర్వహించామని చెప్పారు. తమ పారితోషికంపై ఎన్నిసార్లు అడుతున్నా, బడ్జెట్ విడుదల కాలేదని అధికారులు చెబుతున్నారన్నారు. తమ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి సమస్యను పరిష్కరించడానికి అధికారులు చొరవ చూపించాలని వారు డిమాండ్ చేశారు. నిరసన ప్రదర్శ నలో మండల రెవెన్యూ అధికారి, కార్యాలయం సీనియర్ సహాయకులు, జూనియర్ సహాయకులు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ప్లేవుడ్ పరిశ్రమ కాలుష్యంపై ఫిర్యాదు


తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేస్తున్న దృశ్యం

పూసపాటిరేగ: కొవ్వాడ అగ్రహారం గ్రామపరిధిలోని సిపా ప్లేవుడ్ పరిశ్రమ నుంచి వ్యర్థ జలాలు ఆ గ్రామ పరిధిలోగల పాచి చెరువులో కలవటం ద్వారా కాలుష్యం అవుతోందని ఆ గ్రామస్థులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ ప్రవల్లికకు వినతిపత్రాన్ని అందజేశారు. దీని ద్వారా వచ్చే వ్యర్థ జలాల కారణంగా పంటలు పాడవ్వడంతో పాటు పశువులు మృత్యువాత పడే అవకాశం ఉందని వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వీరు కోరారు. ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలికి, కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సామంతుల సోంబాబు, కోట్ల సత్యంనాయుడు, లెంక సురేష్ పతివాడ రాజినాయుడు తదితరులు ఉన్నారు.

సాగునీటి కాలువ పరిశీలన


సాగునీటి కాలువను పరిశీలిస్తున్న అధికారులు

దత్తిరాజేరు: పెదమానాపురం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న సాగునీటి కాలువ ఇటీవల నూతనంగా నిర్మించిన రహదారి వల్ల మూసుకుపోవడంతో పంటల సాగుకు ఆటంకం కలుగుతుందని గ్రామస్థులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న అధికారులు శుక్రవారం ఆ సాగునీటి కాలువను పరిశీలించారు. సాగునీటి కాలువ పనులు చేపడతామని, రైతులు అధైర్య పడవద్దని ఆర్‌అండ్‌బీ ఏఈ సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ రూప, రైతులు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సమావేశం

చీపురుపల్లి: చీపురుపల్లి మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరిమజ్జి రమణమ్మ, ఎంపీడీవో డి.శ్వేత, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.